# 9 స్థానాల్లో ఎంఐఎం పోటీ

## ఆరుచోట్ల అభ్యర్థులను ప్రకటించిన అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ

సిటీబ్యూరో, నవంబర్ 3(నమస్తే తెలంగాణ)/ చార్మినార్/ఆబిడ్స్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 9 స్థానాల నుంచి ఎంఐఎం పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారని ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ ప్రకటించారు. దారుసలాంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రత్యేకంగా మాట్లాడి, ఆరు అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ప్రస్తుతం ఏడు స్థానాల్లో ఎంఐఎ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉండగా, కొత్తగా మరో 2 స్థానాలైన రాజేంద్రనగర్, జూబ్లీహిల్స్ నుంచి ఎంఐఎం ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు. ఇందులో చాంద్రాయణ గుట్ట నుంచి అక్బరుద్దీన్ ఓవైసీ, నాంపల్లి నుంచి మజీద్ హుస్సేన్, చార్మినార్ నుంచి మాజీ మేయర్ జుల్ఫికర్, యాకుత్‌పురా నుంచి జాఫర్ హుస్సేన్ మిరాజ్, మలక్‌పేట నుంచి అహ్మద్ బలాల, కార్వాన్ నుంచి కౌసర్ మొయినుద్దీన్‌లు బరిలో ఉంటారని తెలిపారు. ఇక బహదూర్‌పుర, జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్ నియోజకవర్గాల అభ్యర్థుల్ని త్వరలోనే ప్రకటిస్తామని, ఒకటి రెండు రోజుల్లో ప్రచారం ప్రారంభిస్తామని అసదుద్దీన్ ఓవైసీ తెలిపారు. కాగా, ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యేలుగా ఉన్న అహ్మద్ పాషా ఖాద్రి, ముంతాజ్ అహ్మద్ ఖాన్‌లు అభ్యర్థులుగా పోటీలో ఉండరని, వారిద్దరి సేవలు పార్టీకి ఉపయోగించుకుంటామన్నారు. ప్రజా సమస్యల్ని పరిష్కరించడంలో ఎంఐఎం ఎప్పుడూ ముందుంటుందన్నారు.

**బాబ్రీ మసీదు కూల్చివేతలో ఆ రెండు పార్టీల పాత్ర...**

బాబ్రీ మసీదు కూల్చివేతలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాత్ర ఎంత ఉందో కాంగ్రెస్ పార్టీది అంతే ఉందని అసదుద్దీన్ ఓవైసీ ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ఆర్ఎస్ఎస్‌కి అమ్మలాంటిది. బాబ్రీ మసీదు కూల్చివేత సమయంలో యూపీలో ఉంది కాంగ్రెస్ సర్కారే. సెక్యూలరిజం అనే అబద్ధపు నినాదంతో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారు. హిందుత్వ ఐడియాలజీలో కాంగ్రెస్, బీజేపీలు ఉన్నాయి. రామ మందిర ప్రారంభానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని సైతం తీసుకువెళ్లాలని సూచించారు. ఇద్దరు ఒక్కటేనన్నారు. భారత్ జోడో అని రాహుల్ గాంధీ అబద్ధాలు మాట్లాడుతున్నాడు. తెలంగాణ సచివాలయంలో ఉన్న మసీదును కూల్చారు. సీఎం కేసీఆర్ దాన్ని అర్థం చేసుకొని కొత్త సచివాలయంలో మసీదు నిర్మించారని అసదుద్దీన్ గుర్తు చేశారు.

**శాంతి సామరస్యాలు బీఆర్ఎస్ వల్లే..**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో ఏకంగా 113 రోజులు కర్ఫ్యూ విధించారని, అదే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్‌లో కర్ఫ్యూ అనే మాటకు చోటు ఇవ్వలేదు. ప్రధానంగా యావత్ ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా సమయంలోనే రెండు సార్లు మాత్రమే కర్ఫ్యూ విధించిన విషయాన్ని అసదుద్దీన్ ఓవైసీ ప్రత్యేకంగా గుర్తు చేశారు. తెలంగాణలో శాంతి సామరస్యాలు ఉండాలంటే.. అది బీఆర్ఎస్ వల్లే సాధ్యమని స్పష్టం చేశారు. అంబర్‌పేట నుంచి కిషన్ రెడ్డి ఎందుకు పోటీ చేయడం లేదో చెప్పాలని డిమాండు చేశారు. రాహుల్ గాంధీ అమేథీలో ఓడిపోయారని, ఆయన హైదరాబాద్ నుంచి పోటీ చేయాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తున్నదని కలలు కంటురన్నారన్నారు. కాంగ్రెస్‌లో సీఎం నువ్వా..? నేనా..? అని కొట్లాడుతున్నారు. బండి సంజయ్ బీసీ కదా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎందుకు తొలగించారని? అలాంటి పరిస్థితుల్లో ఒక బీసీని ముఖ్యమంత్రిని చేస్తామంటే ఎలా నమ్మాలి? అని అసద్దుద్దీన్ ప్రశ్నించారు.



బాగ్-ఏ-జహారాలో గొడవ పడుతున్న కాంగ్రెస్-ఎంఐఎం పార్టీ నేతలు

## కాంగ్రెస్, ఎంఐఎం నేతల మధ్య ఘర్షణ

చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ అక్బర్, ఎంఐఎం పార్టీ నేతలు ఎదురుపడటంతో ఛావునీ డివిజన్‌లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం పాత నగరంలో మసీదులో నిర్వహించే ప్రార్థనలను పార్టీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు వచ్చారు. ఆజంపురా డివిజన్‌లోని చంచల్‌గూడలోని మోతి మసీదు, న్యూ మలక్‌పేట ఐజా స్కూల్ పక్కనే ఉన్న గుల్జార్ మసీదు, చంచల్‌గూడ నయా సడక్ రోడ్డు ఓమర్ బిన్ ఖతాబ్, ఛావునీ డివిజన్‌లోని బాగ్-ఏ-జహారాలో ప్రచారం నిర్వహించేందుకు కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్‌తో పాటు ముజఫర్ అలీ ఖాన్ తదితరులు వెళ్లారు. ఈ సందర్భంగా ఛావునీ డివిజన్ కార్పొరేటర్ ఎంఏ సలాం షాహీద్ తన అనుచరులతో కలిసి బాగ్-ఏ-జాహారాకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్-ఎంఐఎం నేతలు ఒకరికొకరు ఎదురుపడటంతో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. వారి మధ్య మాటా మాటా పెరిగి బాహాబాహికి దిగారు. పరస్పరం ఒకరిపై ఒకరు దూషించుకోవడంతో స్వల్ప వివాదం చోటుచేసుకుంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి వారందరిని చెదరగొట్టారు.

## బీఆర్ఎస్ గెలుపునకు ప్రజలు సిద్ధం - మేయర్ విజయ లక్ష్మి



బీఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలతో మేయర్ గద్వాల విజయలక్ష్మి, బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్, నవంబర్ 3: పేదల కోసం గత పదేళ్లుగా అనేక మంచి పనులు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్నే మరోసారి గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు కార్యకర్తలు, మహిళలు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌తో కలిసి పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఆసరా పింఛన్లు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్స్, గురుకుల పాఠశాలలు లాంటి సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన లక్షలాది కుటుంబాలే పార్టీకి బ్రాండ్ అంబాసిడర్స్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వస్తే రూ.400కే గ్యాస్ సిలిండర్, రూ.15 లక్షల ఆరోగ్య బీమా, రూ.5లక్షల జీవిత బీమాతోపాటు మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం కింద నెలకు రూ.3వేల ఆర్థిక సాయం అందించనున్నామన్నారు. ప్రతిపక్ష పార్టీలు చెప్పే మాటలను ఓటర్లు నమ్మడం లేదని, ఖైరతాబాద్ నియోజకవర్గంలో మరోసారి దానం నాగేందర్ విజయం ఖాయమన్నారు.

## ఎన్నికల నిర్వహణలో అప్రత్తంగా ఉండాలి

- పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించిన రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

సిటీబ్యూరో, నవంబర్ 3(నమస్తే తెలంగాణ): నామినేషన్ల ప్రక్రియ మొదలు కావడంతో క్షేత్ర స్థాయిలో పోలీస్ సిబ్బంది తీసుకోవాల్సిన బందోబస్తు జాగ్రత్తలపై శుక్రవారం రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ సిబ్బందికి ఆన్‌లైన్‌లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఎస్ఐలు, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్ ఇతర సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎన్నికల విధులకు సంబంధించిన నిర్ధిష్టమైన సూచనలను తమ కిందిస్థాయి సిబ్బందికి అందించాలని, క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే కిందిస్థాయి సిబ్బందికి కూడా ఎన్నికల నిబంధనల మీద పరిజ్ఞానం, అవగాహన కల్పించడానికి ఆయా సిబ్బందితో అంతర్గత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని అధికారులకు ఆదేశించారు. అవసరమైన చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి అక్రమంగా తరలిస్తున్న డబ్బు, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఆయా రాజకీయ పార్టీలు తరలించే సామాగ్రిని అడ్డుకోవాలన్నారు. పరిమితికి మించిన అక్రమ నగదును ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ సమక్షంలో సీజ్ చేయాలని సూచించారు. అత్యవసరంగా ఉన్న పోలింగ్ స్టేషన్ ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు, మౌలిక సదుపాయాలు ఏర్పాట్లను ముందుగానే చూసుకోవాలన్నారు. ఇతర



సిబ్బందికి ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తూ ఎన్నికల విధులపై అవగాహన కల్పిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాపై నిఘా ఉంచాలని, శాంతి భద్రతల సమస్యలను సృష్టించేందుకు అవకాశమున్న సోషల్ మీడియా సందేహాలు, వీడియోలు వైరల్ చేసే అవకాశాలుంటాయని, ఉన్నతాధికారులకు ఇలాంటి విషయాలపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో అదనపు సీపీ తరుణ్ జోషీ, డీసీపీలు దరావత్ జానకి, ఇందిరా, అదనపు డీసీపీలు శ్రీనివాస్‌రెడ్డి, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.


### మేడ్చల్ ఎన్నికల వ్యయ పరిశీలకుల నియామకం: కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, నవంబర్ 3(నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అబ్జర్వర్లు, వ్యయ పరిశీలకుల అధికారులను నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ శుక్రవారం వెల్లడించారు. శాసనసభ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల సంఘం జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు ప్రత్యేకంగా నియమించినట్లు పేర్కొన్నారు. మేడ్చల్ నియోజకవర్గానికి అబ్జర్వర్లు(పరిశీలకులు) ఎస్.కె.జైన్, మల్కాజిగిరి, ఉప్పల్‌లకు పూర్వా గార్గ్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలకు అమన్ మిట్టల్‌లను నియమించగా, వ్యయ పరిశీలకులుగా మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్‌లకు ప్రేమ్ ప్రకాశ్ మీనా, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలకు నాగ్వే బాలాసాహెబ్ బాపూరావుల నియమించినట్లు కలెక్టర్ గౌతమ్ వివరించారు.

## మైనార్టీలకు అండగా.. బీఆర్ఎస్ పార్టీ

**మల్కాజిగిరి అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి**

మల్కాజిగిరి, నవంబర్ 3: మైనారిటీలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మల్కాజిగిరి సర్కిల్ శ్రీకాలనీలో మైనారిటీ నాయకుల సమావేశం, అల్వాల్, ఈస్ట్ ఆనంద్ బాగ్, గౌతంనగర్ డివిజన్‌లలో మల్కాజిగిరి అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి ఇంటింటికి ప్రచారం నిర్వహించి సమావేశాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మైనారిటీలకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పూర్తి రక్షణ ఉంటుందన్నారు. విద్యార్థులు చదువుల కోసం రెసిడెన్సియల్ స్కూల్స్‌లో ఉచితంగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కోసం ఆర్థిక సహాయం అందజేస్తున్నామన్నారు. ఆడబిడ్డ పెండ్లికి షాదీ ముబారక్ - కల్యాణ లక్ష్మి పథకంలో రూ.1,00,116 ఇస్తున్నామని, ఎన్నికల తర్వాత రూ.2,00,116 అందజేస్తామని అన్నారు. మౌలాలిలో కమ్యూనిటీ హాల్, శ్మశాన వాటికలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను విడతల వారీగా అమలుపరుస్తామని అన్నారు. విడతల వారీగా పెన్షన్లు పెంచుతామన్నారు. సౌభాగ్య లక్ష్మి పథకంలో మహిళలకు నెలనెల రూ.3 వేలు అందజేస్తామన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి సీఎం కేసీఆర్‌ను హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సునీత రాము యాదవ్, మీనా ఉపేందర్ రెడ్డి, సబితా కిశోర్, శాంతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బద్దం పరశురాంరెడ్డి, జేఏసీ వెంకన్న, మురుగేష్, భాగ్యనంద రావు, ఉస్మాన్, శ్రీనివాస్, ఇబ్రహీం, శైలేందర్, గౌలికర్ దీనేష్, జగదీష్, సంతోష్ గుప్త, ఆది నారాయణ, సాదిక్, నర్సింగ



మల్కాజిగిరి సర్కిల్ శ్రీకాలనీలో మైనారిటీ నాయకులతో మాట్లాతున్న అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

రావు, తోట నాగేష్, నవాబ్, శ్రీనివాస్ రెడ్డి, సాబిర్, ప్రవీణ్ గౌడ్, గణేష్ పాల్గొన్నారు.